ఉపాధ్యాయులను త్వరగా నియమించాలి

-బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూన్ 19 : నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నదని, వెంటనే నియమించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కోరారు. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఎడ్యుకేషన్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి నియోజకవర్గంలో ఉపాధ్యాయుల కొరతపై విన్నవించారు. నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలు, పాటు ఉర్దూ మీడియం, ఇతర పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉందని, పేద విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సెక్రటరీని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

24 న 'చలో ఉట్నూర్ ఐటీడీఏ'

మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

నేరడిగొండ, జూన్ 19 : ఆదివాసీల సమస్యల పరిష్కారానికి తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈ నెల 24న చలో ఉట్నూర్ ఐటీడీఏ ధర్నా కార్యక్రమానికి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావ్, రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ పిలుపునిచ్చారు. బుధవారం నేరడిగొండలో విలేకరులతో మాట్లాడుతూ పోడు భూములు సాగు చేస్తున్న ఆదివాసీలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జీవో నం 3ను యథావిధిగా కొనసాగించి, ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీ ఏర్పాటు చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఐటీడీఏలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ 9 తెగల నాయకులు, ఉద్యోగులు, యువతీ యువకులు, ఉపాధ్యాయ, కార్మికులు, మేధావులు, కవులు, కళాకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తొడసం శంకర్, కోట్నాక్ కోటేశ్వర్, ఆడ హనుమంత్‌రావ్, జేఏవైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేస్రం వినోద్, కనక గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నిర్మల్ అర్బన్, జూన్ 19 : హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ అన్నారు. బుధవారం నిర్మల్ కలెక్టరేట్‌లో మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయాలకు సంబంధించిన టెండరు ప్రక్రియకు ఆయన హాజరయ్యారు. అన్ని మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయాలకు టెండర్లను నిర్వహించారు. టెండర్లు దక్కించుకున్న వారికి ఆదేశాలు జారీ చేశారు. నాణ్యమైన భోజనం అందించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో భుజంగ్‌రావు, డీసీవో సంతోష్, ఆర్సీవో గోపిచంద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

ఎదులాపురం, జూన్19: బడీడు పిల్లలు బడిలో ఉండాలని ఇందు కోసం ప్రతి సంవత్సరం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్మిక శాఖ అధికారి రాజలింగ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడలిలో రెస్క్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా బడీడు పిల్లలతో పని చేయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్పీఎఫ్ సీఐ పాశ్వాన్‌ను కలిసి పలు విషయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌వోలు వినోద్,జగదీశ్వర్ రెడ్డి, హెల్ప్‌లైన్ కో ఆర్డినేటర్ సతీశ్ ఉన్నారు.

టూ టౌన్ ఎస్ఐ లాల్‌సింగ్ నాయక్ వేటు

ఎదులాపురం, జూన్19: ఆదిలాబాద్ టూ టౌన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ లాల్ సింగ్ నాయక్‌పై వేటుపడింది. కొన్ని నెలల కిందట భీంపూర్‌లో పోలీస్‌స్టేషన్‌లో అనేక ఆరోపణలు రావడంతో అక్కడి నుంచి ఎస్ఐ లాల్‌సింగ్ నాయక్‌ను ఆదిలాబాద్ టూ టౌన్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇటీవల సోషల్ మీడియాలో ఒక మతాన్ని కించపరిచేలా చేసిన పోస్టు చేయడంతో ఎస్ఐపై జిల్లా ఎస్పీ గౌష్ ఆలం క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి బుధవారం మెమో జారీ చేశారు. వెంటనే హెడ్‌క్వార్టర్స్ ఆర్ఐకు రిపోర్ చేయాలని ఆదేశించినట్లు డీఎస్పీ తెలిపారు. ఎస్ఐను టూ టౌన్ నుంచి సీఐ ఏ.అశోక్ రీలివ్ చేశారు.

కరెంటు కట్ వాస్తవమే..

- రూ.33 లక్షలతో కొత్త లైన్ ఏర్పాటు
- సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ జయవంత్‌రావ్ చౌహాన్

విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టిన తలమడుగు ఏఈ సతీశ్‌కుమార్

తాంసి, జూన్ 19 : 'కదం తొక్కిన కర్షకులు కరెంటు కట్‌పై ఆగ్రహం..తలమడుగు సబ్ స్టేషన్‌ను ముట్టడి'పై నమస్తే తెలంగాణలో బుధవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం జిల్లా విద్యుత్ శాఖ సూపరిండెంట్ ఇంజినీర్ జయవంత్‌రావ్ చౌహాన్ మాట్లాడుతూ 17న ఉదయం 2.20 గంటల సమయంలో 33 కేవీ ఎన్‌హెచ్ పొచ్చెర సమీపంలో ఒక లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో విరిగి అర్లి(టీ) ఫీడర్ బ్రేక్ డౌన్ అయిందని తెలిపారు. సిబ్బంది వెంటనే అప్రమత్తమై యుద్ధ ప్రాతిపదికన తెల్లవారుజామునలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి ఉదయం 8.40 నిమిషాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారని తెలిపారు. 17న సోమవారం సాయంత్రం ఈదురుగాలుల సమస్యతో 33 కేవీ అర్లి(టీ) ఫీడర్‌ను 132 కేవీ ఆదిలాబాద్ సబ్ స్టేషన్‌ను విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి మాన్యువల్‌గా ట్రిప్ చేశామని తెలిపారు. రాత్రి 8.20నుంచి 8.40 వరకు లైన్‌లో గుర్తించిన లోపాన్ని సరి చేయడానికి 20 నిమిషాల ఎల్‌సీ మాత్రమే తీసుకున్నామని ఎక్కడ అంతరాయాలు లేవని స్పష్టం చేశారు. తలమడుగు మండలకేంద్రంలో 18న సబ్ స్టేషన్‌కు వచ్చిన వినియోగదారులు రైతులకు సమస్యను వివరించామన్నారు. తలమడుగు ప్రాంతాలకు నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు తలమడుగు నుంచి రుయ్యాడి వరకు నాలుగు కిలో మీటర్ల కొత్త లైన్‌కు రూ.33 లక్షల వ్యయంతో మంజూరు చేసి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టామన్నారు. ఈ నూతన లైన్ పనులు పూర్తయితే తలమడుగు ప్రాంతానికి 132 కేవీ ఇచ్చోడ సబ్ స్టేషన్ నుంచి అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవచ్చన్నారు. ఎప్పుడైనా 132 కేవీ ఆదిలాబాద్ సబ్ స్టేషన్ నుంచి వచ్చే లైన్ బ్రేక్ డౌన్ అయినప్పుడు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరాను అందిస్తామని రైతులు, వినియోగదారులు ఆందోళన చెందవద్దని తెలిపారు.

నిర్మల్ కలెక్టర్‌కు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల శుభాకాంక్షలు

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

ఎదులాపురం,జూన్19: నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అభిలాష అభినవ్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అవుట్ సోర్సింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు దుర్గం శేఖర్ ఆధ్వర్యంలో కలిశారు. బుధవారం కలెక్టరేట్‌లో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీలకు మాత్రమే ప్రస్తుతం నిర్వహిస్తున్న 2024-25 సంవత్సరం కోసం ఎంపానాల్మెంట్ టెండర్లలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీలకు మొదటి ప్రాధాన్యమివ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీలకు న్యాయం చేస్తానని కలెక్టర్ భరోసా కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రుక్మారెడ్డి, బాబాగౌడ్, శ్యాంరావు, మీసాల భాస్కర్‌గౌడ్ తదతరులు ఉన్నారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ కలెక్టర్‌కు సన్మానం

కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ జిల్లా కమిటీ సభ్యులు

ఎదులాపురం, జూన్19 : పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకున్నందుకు కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా ప్రశంసా పత్రం పొందిన కలెక్టర్ రాజర్షి షాను టీఎన్జీవోస్ జిల్లా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో టీఎన్జీవోస్ సభ్యులు కలిసి శాలువా, పూలమొక్కను అందజేసి ఘనంగా సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల విధులను సజావుగా నిర్వహించడంతో పాటు విజయవంతం చేసిన ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షకార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్‌కుమార్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్ జరపాలని, వివిధ శాఖలలో ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ సభ్యులు తిరుమల్ రెడ్డి, కొమ్రే అరుణ్‌కుమార్, ప్రశాంత్‌ఠాకుర్, చంద్రశేఖర్, సుజాత, సుమిత్ర, రాజు, సాయి, నవీన్, ఆశాజ్యోతి, సంజయ్, రజినీకాంత్, తదతరులు ఉన్నారు.

రైతాంగ సమస్యలపై కాంగ్రెస్ చిత్తశుద్ధి లేదు

బీజేపీ శాసన సభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి

మాట్లాడుతున్న బీజేపీ శాసన సభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్, జూన్ 19(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ఆరు నెలల పాలన పూర్తిగా గాడి తప్పిందని, ముఖ్యంగా ఈ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి రైతాంగ సమస్యలపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో వానకాలం సీజన్ ప్రారంభమైని ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. ఈ ముఖ్యమంత్రికి పంట పెట్టుబడి ఎప్పుడు అవసరముంటుందో కనీస అవగాహన ఉంటే వెంటనే రైతు భరోసా ఇచ్చేవారని ఎద్దేవా చేశారు. నిర్మల్‌లోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసాపై ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. రైతుభరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పినా నేటికీ ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాల్లో జమచేయలేదన్నారు. గత యాసంగి సీజన్‌లో కూడా రైతులందరికీ రైతుబంధు ఇవ్వలేదని, కేవలం ఐదు ఎకరాల లోపు రైతులకే ఇచ్చారన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు, ప్రతి రైతుకు రైతుబంధును అందజేసిందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం ఈ నెల 18న పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు.నియోజకవర్గంలో భూ ఆక్రమణలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఎంతటి వారైనా చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. నిర్మల్ శివారులోని శ్రీకృష్ణ ఆలయానికి సంబంధించిన దాదాపు తొమ్మిది ఎకరాల భూమిని ఇప్పటికే అధికారులతో సర్వే చేయించామని, ఆ భూమి ఆలయానికి చెందినదిగా గుర్తించారన్నారు. ఇదిలా ఉంటే నిర్మల్ మున్సిపాలిటీలో అక్రమంగా నియమించిన 42 మంది పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలకు సంబంధించి అక్రమాలకు పాల్పడ్డ వారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. దీనిపై న్యాయపోరాటం చేసి అక్రమాలకు పాల్పడ్డవారికి శిక్ష పడేలా చూస్తానన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు వీ సత్యనారాయణ గౌడ్, సరికెల గంగన్న, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపడుతాం

- నమస్తే తెలంగాణకు స్పందన

భవనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ ఇంజినీరింగ్‌శాఖ అధికారులు

నార్నూర్, జూన్19: పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ఇంజినీరింగ్‌శాఖ ఏఈఈ భీంరావ్ అన్నారు. ఉరుస్తున్న పాఠశాల భవనం అనే శీర్షికతో నమస్తే తెలంగాణ దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ ఇంజినీరింగ్‌శాఖ అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరి పాఠశాలను సందర్శించారు. పలు వివరాలను ప్రధానోపాధ్యాయురాలు అనితను అడిగి తెలుసుకున్నారు. మన ఊరు..మన బడి ద్వారా పాఠశాలను ఎంపిక చేశామని, అమ్మ ఆదర్శ ద్వారా కూడా ఎంపిక చేసి నిధులు కేటాయించామన్నారు. ఈ నిధులతో సదరు కాంట్రాక్టర్ ఏయే పనులు చేపట్టారని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను సక్రమంగా వినియోగిస్తూ నాణ్యమైన పనులు చేపట్టాలని సదరు గుత్తేదారుడికి సూచించారు. త్వరలోనే సమస్యను పరిష్కారించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట డీఈ శివప్రసాద్, ఏఈ రాథోడ్ సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

వైద్య పరీక్షలు చేయించుకుంటున్న డీఎస్పీ

ఎదులాపురం, జూన్19 : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం జల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు జిల్లా పోలీసులకు కేర్ హాస్పిటల్ సహకారంతో మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ సిబ్బందికి కోసం వైద్య శిబిరం నిర్వహణపై జిల్లా ఎస్పీ గౌషికి ధన్యవాదాలు తెలిపారు. 300 మంది సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ స్పెషల్ బ్రాంచ్ పోతారం శ్రీనివాస్, సీఐలు కే సత్యనారాయణ, డీ సాయినాథ్, ఏ.అశోక్, శ్రీనివాస్,కే ఫణింధర్, ప్రణయ్ కుమార్, ఆర్ఐ సీఐలు టీ.మురళి, ఏ నవీన్ కుమార్, చంద్రశేఖర్ , అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, డాక్టర్ శాంతిరాజ్ , సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌లో బుక్స్ సప్లై చేయొచ్చు

ఎదులాపురం,జూన్19: ప్రైవేట్ పాఠశాలలో బుక్స్‌ను నో లాస్ నో ప్రాఫిట్‌పై పిల్లలకు అందించవచ్చని తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల నిర్వహణ సంఘం ఆదిలాబాద్(టీఆర్ఎస్ఎంఏ) జిల్లా అధ్యక్షుడు రంగినేని పవన్‌రావు అన్నారు. బుధవారం డీఈవో టీ.ప్రణీతకు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలో బుక్స్ ఎమ్మార్పీ రేటుకు పిల్లలకు విక్రయించవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన కోర్టు ఆర్డర్ కాపీ ఉందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో ప్రత్యేక కౌంటర్ పెట్టి పిల్లలకు నోలాస్ నో ప్రాఫిట్, డిస్కౌంట్ రేట్లు విక్రయించవచ్చన్నారు. కలిసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్దం పురుషోత్తంరెడ్డి, జిల్లా కోశాధికారి దేవేందర్ పటాస్కర్, వేదవ్యాస్, అమిరుద్దీన్, ఫైజల్ తదితరులున్నారు.

అమ్మకానికి 60 బొగ్గు గనులు

హైదరాబాద్ వేదికగా రేపు వేలం వేయనున్న కేంద్రం



హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం మరోసారి వాణిజ్య బొగ్గు గనులను వేలం వేయనున్నది. ఈసారి ఇందుకు హైదరాబాద్ వేదిక అవుతున్నది. గతంలో ఢిల్లీ, ముంబై, బెంగళూరు తదితర నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ 10వ విడుత కోల్ బ్లాక్స్ వేలాన్ని మాత్రం ఇక్కడ చేపడుతున్నారు. దీనిలో భాగంగానే శుక్రవారం (ఈ నెల 21) దేశవ్యాప్తంగా ఉన్న 60 బొగ్గు బ్లాక్‌లను మోదీ సర్కారు అమ్మకానికి తెస్తున్నది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వేలం ప్రక్రియను ప్రారంభిస్తారు. ఆ శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, కార్యదర్శి అమృత్ లాల్ మీనాతోపాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఎంఎస్‌టీసీ ప్లాట్‌ఫామ్‌పై వేలానికి సంబంధించిన వివరాలను పొందుపర్చారు. పర్సంటేజ్ రెవెన్యూ షేర్ మాడల్ ఆధారంగా ఆన్‌లైన్‌లో బొగ్గు గనుల వేలాన్ని నిర్వహిస్తారు. ఇక ఈ గనుల్లో కోకింగ్, నాన్-కోకింగ్ బొగ్గు బ్లాకులున్నాయి.

సింగరేణి పాల్గొనేనా..

ఈ బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొంటుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందా? లేదా? అన్నది కూడా స్పష్టత రావాల్సి ఉన్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి నాడు వేలానికి దూరంగా ఉన్నది. కాగా, తెలంగాణలోని శ్రావణపల్లి బ్లాక్‌లో జీ-10 గ్రేడ్ బొగ్గు లభ్యమవుతుండగా, ఇక్కడ 119 మిలియన్ టన్నుల నిల్వలే ఉన్నట్టు తేల్చారు. దీంతో ఈ బ్లాక్‌పట్ల సింగరేణి ఆసక్తి చూపడం లేదు. ఆర్థికంగా అంత శ్రేయస్కరం కాదన్న భావనలో అధికారులున్నారు. ఇదే విషయంపై సింగరేణి సీఎండీ బలరాంను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా.. ఆర్థికంగా ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నామన్నారు. తర్వాతే వేలంలో పాల్గొనాలా? వద్దా? అన్నది నిర్ణయిస్తామన్నారు.

వేలాన్ని అడ్డుకుంటాం: రాజిరెడ్డి

బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకొని సింగరేణిని కాపాడుకుంటామని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లతోపాటు ఇతర ఖనిజ నిల్వలను వేలం వేయకుండా కాపాడిన విషయాన్ని కార్మికులు గమనించాలని, ప్రైవేటీకరణను ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన స్పష్టంచేశారు. వేలం వేస్తే ఇటీవల కొత్తగా ఉద్యోగాల్లో చేరిన 20 వేల మంది కార్మికుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందన్నారు.

1.56 లక్షల కోట్లు

గత ఆర్థిక సంవత్సరం ప్రైవైట్‌పరమైన ప్రభుత్వ ఆస్తుల విలువ



వాటాల విక్రయం, డివిడెండ్లతో..

అందినకాడికి అమ్ముకుంటూపోతున్న మోదీ సర్కారు.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో వాటాల విక్రయం ద్వారా, ఆయా కంపెనీలిచ్చే డివిడెండ్లతో కూడా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నది. ఇప్పటికే చాలా సంస్థల్లో వాటాలను తగ్గించుకున్న కేంద్రం.. ఎయిర్ ఇండియా వంటి సంస్థలను అడ్డగోలుగా మొత్తం విక్రయించిన సంగతి విదితమే. ఇక ఒక్క రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచే గత పదేండ్ల హయాంలో దాదాపు రూ.9 లక్షల కోట్లను డివిడెండ్‌గా అందుకున్నది. గత ఆర్థిక సంవత్సరానికైతే రికార్డు స్థాయిలో ఆర్బీఐ రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను ప్రకటించినది తెలిసిందే. మిగతా ప్రభుత్వ సంస్థల నుంచీ పెద్ద ఎత్తునే డివిడెండ్ ఆదాయం వస్తున్నది. అయినప్పటికీ కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించకుండా ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలకే కేంద్రం ఆసక్తి చూపుతుండటం ఇప్పుడు సర్వత్రా విమర్శలపాలవుతున్నది.

ఈ ఆర్థిక సంవత్సరం ఇంకో 2 లక్షల కోట్ల ఆస్తులు ఔట్

న్యూఢిల్లీ, జూన్ 19: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జాతీయ నగదీకరణ కార్యక్రమం (ఎన్ఎంపీ) కింద కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు రూ.1.56 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను అమ్మేసింది. నిజానికి రూ.1.80 లక్షల కోట్ల ఆస్తులను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోవడం గమనార్హం. బుధవారం వచ్చిన అధికారిక ప్రకటన ప్రకారం 2021-22 నుంచి 2024-25 వరకు మొత్తం నాలుగేండ్లలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మౌలిక రంగ ఆస్తులను అమ్మి రూ.6 లక్షల కోట్ల నిధులను సమీకరించాలని బీజేపీ సర్కారు నిర్దేశించుకున్నది. ఈ క్రమంలోనే 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో దాదాపు 2.30 లక్షల కోట్ల ఆస్తులను అమ్మేసింది.

వచ్చే మార్చికల్లా..

2023-24తో కలిపితే మూడేండ్లలో రూ.4 లక్షల కోట్ల ఆస్తులను విక్రయించినట్టవగా, తొలి రెండేండ్లతో పోల్చితే తర్వాతి సంవత్సరంలోనే అత్యధికంగా అమ్మేయడం గమనించదగ్గ అంశం. ఇక లక్ష్యాన్ని చేరుకోవాలంటే వచ్చే మార్చి నాటికి ఇంకా రూ.2 లక్షల కోట్ల విలువైన ఆస్తులను అమ్మాల్సి ఉన్నది. దీంతో త్వరలోనే మరింత సర్కారీ సంపద.. ప్రైవేట్‌పరం కాబోతున్నది. ఇప్పటికే ఎన్‌హెచ్ఏఐ 33 ఆస్తులను కూడా గుర్తించింది. కాగా, రోడ్డు రవాణా-జాతీయ రహదారులు, బొగ్గు, విద్యుత్తు, గనులు, పెట్రోలియం-సహజ వాయువు, పట్టణాభివృద్ధి, షిప్పింగ్ తదితర మంత్రిత్వ శాఖల్లో ఆస్తుల అమ్మకాలకు సంబంధించి పెట్టుకున్న లక్ష్యంలో 70 శాతం పూర్తయినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

గత ఆర్థిక సంవత్సరం కేంద్రం అమ్మేసిన ప్రభుత్వ ఆస్తులు

శాఖ	విలువ (రూ.కోట్లలో)
రోడ్డు రవాణా, జాతీయ రహదారులు	40,314
బొగ్గు	56,794
విద్యుత్తు	14,690
గనులు	4,090
పెట్రోలియం-సహజ వాయువు	9,587
పట్టణాభివృద్ధి	6,480
షిప్పింగ్	7,627
మరికొన్ని శాఖల్లో	16,500

ఏసీల ధరలకు రెక్కలు

8 శాతం వరకు భారీగా పెరిగిన విలువ

120 కోట్లు దాటిన టెలికం కస్టమర్లు

న్యూఢిల్లీ, జూన్ 19: టెలికం వినియోగదారులు మళ్లీ 120 కోట్లు దాటారు. ఏప్రిల్ నెల చివరినాటికి దేశవ్యాప్తంగా 120.12 కోట్ల మంది టెలికం సబ్‌స్క్రైబర్లు ఉన్నారని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 116.54 కోట్ల మంది ఉన్నారు. టెలికం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోతున్నది. కొత్తగా జియో నెట్‌వర్క్‌ను 26.8 లక్షల మంది ఎంచుకోవడంతో మొత్తం సంఖ్య 47.24 కోట్లకు చేరుకోగా, అలాగే భారతీ ఎయిర్‌టెల్‌కు 7.52 లక్షల మంది జతవడంతో 26.75 కోట్లకు చేరుకున్నారు.

న్యూఢిల్లీ, జూన్ 19: ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకోవడంతో సామాన్యులు సైతం ఏసీలను కొనుగోలు చేస్తున్నారు. ఈ వేసవి సీజన్‌లో ఏసీల విక్రయాలు రికార్డు స్థాయి రెండంకెల వృద్ధి నమోదైంది. అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయన్న అంచనాతో వీటి ఉత్పత్తి సంస్థలు ఇదే అదనుగా ఏకంగా ధరలను కూడా భారీగా పెంచాయి. గతంలోనే ధరలను స్వల్పంగా పెంచిన సంస్థలు జూన్ నెలలో మరోసారి 6 శాతం నుంచి 8 శాతం వరకు సవరించాయి.

ఉత్పత్తి భారీ పెంపు..

డిమాండ్ అధికంగా ఉండటంతో ఏసీల తయారీ సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచాయి కూడా. సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు ఉపక్రమించాయి. టాప్ కంపెనీలైన వొల్టాస్, ఎల్‌జీ, లాయిడ్‌లు ఏకంగా తమ కెపాసిటీని రెండింతలు పెంచుకున్నాయి. ఏసీల ఉత్పత్తి స